క్లుప్తంగా

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



ఫిరంగిపురం: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వాల్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ అదానీకి లాభాలు చేకూర్చేందుకు కేంద్రప్రభుత్వం ప్రజలపై స్మార్ట్ మీటర్ల భారాన్ని మోపుతోందన్నారు. అంతేకాక ప్రజలపై ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో రూ. 15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.వెంకటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు,వై. నాగేశ్వరరావు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో నివాస పట్టాలు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు సీపీఎం శాఖ కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. 1988 ఏప్రిల్‌లో ఆనాటి ప్రభుత్వం ఉండవల్లి గ్రామ సర్వే నెం. 211/2ఏ వన్ ఏ త్రీ పరిధిలోని నివాస స్థలాలకు బీఫారం పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే అవి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించకపోవడం వల్ల కుటుంబాల ఆర్థిక అవసరాలకు ఆ పట్టాలు ద్వారా బ్యాంకు రుణ సదుపాయం పొందలేకపోతున్నట్లు విన్నవించారు. లోకేష్ ఈ విషయం పరిశీలించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. సిపిఎం శాఖ సభ్యులు ఉండవల్లి పార్థసారథి, తుమ్మపూడి శివయ్య స్థానికులున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వినతి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మంత్రి నారా లోకేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు బొజ్జ సుబ్బారావు, ఉండవల్లి పార్థసారథి తదితరులు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను వెంటనే మంజూరు చేయించాలని విన్నవించారు. స్పందించిన మంత్రి నారా లోకేష్ నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రజా వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు, పొనుగుపాడు గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు కోరారు. రెండు గ్రామాల్లో మూడు రోజుల పాటు నిర్వహించే క్యాంప్‌లో పిల్లలకు నూతన ఆధార్, చిరునామాలో మార్పులు, తప్పొప్పులు సవరించుట వంటివి చేస్తారని చెప్పారు. ఇప్పటి వరకు 19 మంది నూతన ఆధార్ సరవణలు చేయించుకున్నారని తెలిపారు. డీఏలు గుంటుపల్లి సునీత, ఎం.అన్నా యొజశ్వమాలికా, మహిళా పోలీసులు ఎం .శాంతి, సీహెచ్ వాత్సల్య పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి వినతి



మంగళగిరి టౌన్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ సమస్యలను పరిష్కరించాలని క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛ మంగళగిరి ప్రాజెక్ట్‌లో క్లాప్ ఆటో డ్రైవర్ల కృషి ఎనలేనిదని అన్నారు. ప్రజల నివాసాల నుంచి వచ్చే వ్యర్థాలను సమీకరించి, డంపింగ్ యార్డులకు నిత్యం క్లాప్ ఆటో డ్రైవర్లు చేరవేస్తారని చెప్పారు. అలాంటి వారి సమస్యను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే 2 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని, కొన్ని నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. సకాలంలో డ్రైవర్లకు జీతాలు ఇవ్వాలని, వీరందరిని ఆప్కాస్‌లో చేర్చి వారి వేతనం 12,500 నుంచి రూ.18,500లకు వరకు పెంచాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు చెంగయ్య, జవహర్‌లాల్, బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు శివ, రవి, యోహాను, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మారని గీత

- రెక్కల కష్టం మినహా..ప్రోత్సాహం అందని కల్లు గీత కార్మికులు
- సొసైటీ వంక చూడని ప్రభుత్వం
- సబ్సిడీ పథకాలు, రుణాలతో వృత్తికి ఊతం



ఫిరంగిపురం: రెక్కాడితే డొక్కాడని కల్లు గీత కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కల్లు గీత కార్మిక సొసైటీ నుంచి ప్రోత్సాహం లేక, ప్రభుత్వం నుంచి సహాయం అందక వారు దయనీయంగా జీవితం చక్రం నడిపిస్తున్నారు. వృత్తిలో ఉన్నాం కాబట్టే చెట్ల నుంచి కల్లు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు.
మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 150 గీత కార్మిక కుటుంబాలున్నాయి. అందులో 35 కుటుంబాలు మాత్రమే గీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాయి. వారికి ఇళ్ల స్థలాలు, సరైన నివాస గృహాలు లేక ఇరుకు గదుల్లో జీవిస్తున్నారు. ఎంతో కష్టించి ఓపికతో కనీసం 30 అడుగుల ఎత్తుండే చెట్లను మోకుల సాయంతో రెండు పూటలా ఎక్కుతూ కల్లు సేకరిస్తుంటారు. ధరించిన మోకు తెగినా, జారిపడినా ప్రాణాలు పోయినట్లేనని గీత కార్మికులు చెబుతున్నారు. అంతటి కష్టతర వృత్తిలో ఉన్నప్పటికీ కూడా ఇష్టంగా వీరు వృత్తిని నమ్ముకున్నారు.

టీసీఎస్ సొసైటీ

మండల కేంద్రమైన ఫిరంగిపురం 113 తాళ్లూరు, శిరంగిపాలెం, అమీనాబాద్, వేములూరిపాడు, గొల్లపాలెం, హౌస్ గణేష్‌నిపాడు గ్రామాలకు చెందిన గీత కార్మికులు కల్లుగీత కార్మికుల సొసైటీగా ఏర్పడి పనులు చేస్తున్నారు. పేరుకు సొసైటీయే కాని ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం, సహాయం కాని అందడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీఎఫ్‌టీ(టాడీఫర్ ట్యాపర్) అనగా గీతకార్మికుడు వ్యక్తిగతంగా లైసెన్సు తీసుకొని అమ్ముకోవడం. రోజంతా కష్టపడి అమ్మినా కూలీ కూడా రానిపరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమను ప్రభుత్వం గుర్తించడం లేదని అంటున్నారు.

సహాయం నిల్..

కల్లు గీత కార్మికులకు సంబంధించి సొసైటీ ఉన్నా కూడా మిగిలిన సొసైటీల మాదిరిగా తమకు ఎటువంటి సాయం అందడంలేదని ఆవేదన సభ్యులు చెందుతున్నారు. సరిపడినన్నీ తాటి, ఈత చెట్లు లేవని, కొన్ని ప్రాంతాల్లో రైతులు వాటిని కొట్టివేస్తున్నారని చెబుతున్నారు. 50 ఏళ్లు నిండిన గీతకార్మికులకు ప్రత్యేకంగా పింఛన్ లేకపోవడం, వ్యక్తి గత రుణాలు ఇవ్వకపోవడం, ద్విచక్ర వాహనం కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వడం వంటివి లేవని చెబుతున్నారు. ఏటా గీతకార్మికుడికి 150 వరకు కుండలు, తాళ్లు, బద్దలు వంటివి అవసరం అవుతాయని వాటికి సంబంధించి రుణాలు అందని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

మద్యం షాపులు వారికెందుకు..

ఇటీవల కల్లు గీత కార్మికులకు మద్యం షాపులు కేవలం వృత్తిని నమ్ముకున్న గీత కార్మికులకు కాకుండా, కుల పరంగా కేటాయించారు. గీత కార్మికులకు దుకాణం కేటాయిస్తే సాయం అంది ఉండేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి. వ్యక్తిగత రుణాలు అందిస్తే అప్పుల నుంచి బయటపడే పరిస్థితి ఉంటుంది. సొసైటీకి కొంత బంజరు భూమిని కేటాయించి తాటి, ఈత విత్తనాలు అందించాలి.
– జి.రాములు, కల్లుగీత కార్మిక సొసైటీ ప్రెసిడెంటు

గీత కార్మికులను ప్రోత్సహించాలి



వృత్తిలో కొనసాగుతున్న కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. సబ్సిడీపై వాహనాలు, వ్యాపారానికి పెట్టుబడి ధనం సబ్సిడీపై అందేలా చూడాలి. తమ పిల్లలకు ఉద్యోగాలు కేటాయించాలి.
– పెద చెన్నయ్య. గీతకార్మికుడు, వేమవరం

పబ్లిక్ టాయిలెట్స్ ఎక్కడ?



పాత తహసీల్దారు కార్యాలయం వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు



పబ్లిక్ టాయిలెట్స్ లేని తహసీల్దారు కార్యాలయం

మంగళగిరి టౌన్: ఇంటింటికి మరుగుదొడ్లు ఉండాలని ప్రచారం చేస్తున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద మాత్రం వాటిని వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారు. పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కార్యాలయాల వద్ద అయితే అధికారులకు టాయిలెట్స్ లేవు. దీంతో తమ అవసరాలకు వారు కూడా బయటకు పరుగులు తీస్తున్నారు. స్థానిక మండల ప్రజా ప్రజాపరిషత్, ఎంటీఎంసీ, తహసీల్దార్ కార్యాలయాలు, మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లు, విద్యాశాఖ, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, విద్యుత్‌శాఖ, ప్రభుత్వ ఆసుపత్రి పట్టణంలో ఉన్నాయి. మెప్మా కార్యాలయం వద్ద మరుగుదొడ్ల లేక నిత్యం వచ్చే పొదుపు సంఘాల మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మహిళలు, పురుషులు కార్యాలయాల మాటున ఆరుబయటకు మూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వెరశి స్వచ్ఛ భారత్, స్వచ్ఛ మంగళగిరి లక్ష్యాలు దెబ్బతింటున్నాయి. అవి ప్రజలకే కానీ, ప్రభుత్వ అధికారులకు, కార్యాలయాలకు వర్తించవని రుజువు చేస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి ఆయా కార్యాలయాల సిబ్బంది అవసరాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గతంలో సిబ్బంది కోసం టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఇవి అప్పట్లో సిబ్బంది వరకే ఉపయోగించుకుని వాటికి తాళాలు వేసి వారి దగ్గరే ఉంచుకున్నారు. అవి ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) రోజున పెద్ద సంఖ్యలో వచ్చే అర్జీదారులు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. నగర పరిధిలోని పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లు, సబ్‌రిజిస్ట్రార్, ట్రెజరీ కార్యాలయాలు వచ్చేవారు మూత్రవిసర్జన చేయాలంటే ఎక్కడకు వెళ్లాలో తెలియని పరిస్థితి. ఉగ్గపట్టలేక ఆ కార్యాలయ పరిధిలోనే చెట్లమాటుకు వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోదీ



ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మంగళగిరి టౌన్ : దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గురువారం మంగళగిరి మండల పరిధిలోని చినకాకానిలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆర్థిక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ దేశవ్యాప్త ప్రచార ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లును కేంద్ర ప్రభుత్వం ఏకచక్రాధిపత్యంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి దాసోహం కాబట్టే విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నాయకులు జాన్‌బాబు, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో స్వచ్ఛ తాడేపల్లి



తాడేపల్లి రూరల్ : స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ తాడేపల్లి కార్యక్రమంలో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని మహానాడు–2 సచివాలయ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో మరింత చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు నివాసాల్లోని చెత్తను రోడ్లపై, మురుగు కాల్వలలో పడవేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వల్లభనేని వెంకటరావు, ఇట్టా పెంచలయ్య, చిన్నపోతుల చిన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్. సుప్రియ, డాక్టర్ ప్రసాద్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్, వైఆర్సీ, జేసీఐ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం అవసరమని, అందుకు స్వచ్ఛంధ రక్తదానాన్ని ప్రతి ఒక్కరు ఒక బాధ్యతగా చూడాలని విద్యార్థులకు సూచించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ రక్తదానంపై అపోహలను తొలగించుకోవాలని చెప్పారు. జీజీహెచ్ విజయవాడ, గుంటూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రక్తం డొనేట్ చేసినట్లు ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, వైఆర్‌సీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సుప్రియ తెలిపారు. శిబిరానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి. సురేష్, రక్తదాతలను వర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, యూత్ రెడ్ క్రాస్ ఇన్‌చార్జి సుప్రియ, జేసీఐ జోన్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ సంఘాలు

తాడేపల్లి రూరల్ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా తాడేపల్లి బ్రహ్మానందపురం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మానందపురంలోని లూథరన్ చర్చి వద్ద నుంచి రామయ్య కొట్టు సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల దైవజనులు మాట్లాడుతూ ప్రవీణ్ కుటుంబానికి ఆదరణ, ఓదార్పు కలగాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవీణ్ మృతి క్రైస్తవులకు మనోవేదన గురిచేసిందని, ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరారు. ఆయన మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దైవ జనులు వెంకటరావు, ఎలీషా దేవరాజ్, మాణిక్యాలరావు, రమేష్, జాన్ సుందర్‌తో పాటు సంఘస్తులు రమేష్, రాజశేఖర్, శోభన్ బాబు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వేప కషాయం తయారీపై రైతులకు అవగాహన



తెనాలిటౌన్: వేప కషాయం తయారీ, వినియోగంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.ఉషారాణి సూచించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం లామ్ గుంటూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వేప కషాయం తయారీ, పంటలో వినియోగం, ఉపయోగాలను వివరించి చార్ట్ రూపంలో చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, రైతులు కళ్యాణం మల్లిఖార్జునరావు, కళ్యాణం వెంకటరామయ్య, బీఏపీ శివసాయితేజ, మౌనిక, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు పెసలు కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

దుగ్గిరాల: రైతులు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వం పెసలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, దుగ్గిరాలలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా పాల్గొన్న రాష్ట్ర సమాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడాతూ పెసలు ధరలు పతనమై రైతులు నష్టపోతున్నారన్నారు.ప్రైవేటు వ్యక్తులు రైతులు దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం కొనుగొలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు లబ్ధి చేకురుతుందని చెప్పారు. పెసలు రూ.8,682 ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, జి.బాలరాజు, డి.జక్రయ్య పాల్గొన్నారు.

ఫొటో మార్ఫింగ్ పోస్టులు పెట్టిన వారిపై చర్యలు



తాడేపల్లి పోలీసులు అందజేసిన ఎఫ్ఐఆర్ కాపీలతో వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తాడేపల్లి పోలీసులు గురువారం పలువురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తికి కేసుకు సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి చర్యల్లో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు పోలీసులు తీసుకుంటారని భావిస్తున్నట్లు నారాయణమూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యకరమంలో న్యాయవాది వెంకట నారాయణ రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రాష్ట్రఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, సెక్రటరి కొలుసు మోహన్, రాష్ట్ర ఎస్సీ సెల్‌ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, గంజి షణ్ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆదర్శం

నూతక్కిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కేరళ బృందం



రైతు ఉషారాణి పొలంలో సేంద్రియ సాగు విధానం తెలుసుకుంటున్న కేరళ రైతుల బృందం

మంగళగిరి: నూతక్కి, రామచంద్రాపురం, కొల్లిపర మండలంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సాగు విధానం రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని కేరళ రైతుల బృందం ప్రశంసించింది. శుక్రవారం మండలంలోని నూతక్కి, రామచంద్రాపురంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సాగు, పంటలను కేరళ రైతుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు శ్రీనివాస్‌రెడ్డి, ఉషారాణి, వసంత, కౌలు రైతు మల్లికార్జునలను ప్రకృతి వ్యవసాయం గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. అరటి, అంతర పంటలు, ఆకుకూరలు, కూరగాయల, పసుపు పంటలను అడిగి తెలుసుకున్నారు. పంటల సాగుపై జిల్లా అధికారులు, రైతులు కేరళ రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై పెట్టుబడి, ఆదాయం తదితర వివరాలను, హెల్త్, న్యూట్రిషన్ విధానాలను, ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యుల పాత్రలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజక్టు మేనేజర్ రాజకుమారి, థీమాటిక్ లీడ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎడ్ల బలప్రదర్శన



సబ్ జూనియర్స్ విజేత ఎడ్ల జత యజమానికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు

తెనాలిరూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి. రోజు రోజుకూ ప్రేక్షకుల సంఖ్య పెరుగుతోంది. సబ్‌జూనియర్స్ పోటీలు బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించి ముగించారు. ఈ విభాగంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4200 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి. బాపట్ల జిల్లా నగరం మండలం మంతెనవారిపాలెంకు చెందిన మేక ప్రతీక్ జత(3900 అడుగులు) రెండో బహుమతిని, కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరుకు చెందిన గరికపాటి శ్రీధర్ జత (3311.05 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. ఆరో రోజుకు చేరిన పోటీల్లో గురువారం జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. మొత్తం తొమ్మిది జతలు పోటీలకు రాగా రాత్రి పొద్దుపోయే వరకు పోటీలు జరిగాయి. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అతిథులుగా హాజరయ్యారు. సబ్ జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు. సూరపనేని రాధాకృష్ణమూర్తి రిఫరీగా వ్యవహరించారు.

నేడు సీనియర్ విభాగం పోటీలు

ఎడ్ల బలప్రదర్శనలో భాగంగా సీనియర్ విభాగంలో పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ విభాగానికి ఇప్పటికే 11 జతల ఎడ్లు రాగా డ్రా తీసి ఉదయం కొన్ని తిరిగి సాయంత్రం కొన్ని ఎడ్లకు పోటీలను నిర్వహిచనున్నట్టు రిఫరీ తెలిపారు.

తెనాలిలో ముగిసిన రుణమేళా

తెనాలిటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణ మేళా గురువారంతో ముగిసింది. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు రుణమేళాకు హాజరయ్యారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను, సివిల్ స్కోర్‌ను బ్యాంకు అధికారులు పరిశీలించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి కార్యాలయంలో నిర్వహిస్తున్న రుణమేళా పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో ఆన్‌లైన్‌లో 835 మంది అభ్యర్థులు బీసీ, ఓసీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం 300 మంది అభ్యర్థులు హాజరుకాగా, గురువారం 350 మంది హాజరైనట్లు తెలియజేశారు. వీరిలో అర్హత కలిగిన అభ్యర్థులకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలను అరికట్టండి

తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన పంట కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పినపాడులోని పంటకాల్వను గురువారం పరిశీలించారు. వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం 21, 26, 27, 28 వార్డుల్లో ఆమె పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పర్యటనలలో నా దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆవిష్కరణలకు నాంది పలకండి

తెనాలిఅర్బన్: విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలను మండల విద్యాధికారి–2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. రోబో వింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన హ్యూమనైడ్ రోబోట్, ఏఐ ప్రోగ్రామింగ్, చాట్ జీపిటి ప్రోగ్రామింగ్, హోమ్ ఆటోమిషన్, డ్రోన్ వంటి పరికరాలు పనిచేసే తీరును విద్యార్థులు వివరించారు. స్కూల్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ తమ పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోబోటిక్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు వి.నాగ వెంకట సాయిరాం, షేక్ సాజీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక మనస్తత్వంపై అవగాహన అవసరం



తెనాలిటౌన్: విద్యార్థులు వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలని కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు సూచించారు. గురువారం రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఈఎండీపీ ప్రాజెక్టులో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. 9వతరగతి విద్యార్థులు జంగం దర్శిని ప్రియా, నలుకుర్తి అలేఖ్య, షేక్ కమర్ జహాలు ఏకో ఫ్రెండ్లీ హెర్బల్ అండ్ ఆర్గానిక్ షాపు అనే ప్రాజెక్టును జిల్లా స్థాయిలో ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ మత్తె అన్నారావును అభినందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.